నమస్తే తెలంగాణ
# జనగామ
3 | గురువారం 9 మే 2024 | JANAGAON



జనభేరి సభలో అభివాదంచేస్తున్న ప్రధాని మోదీ, పక్కన వరంగల్, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులు అరూరి రమేశ్, అజ్మీరా సీతారాంనాయక్



కాశీబుగ్గ : కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

# అవినీతి.. కాంగ్రెస్ నైజం

- **ఆ పార్టీ వస్తే దేశంలో సమస్యలే**
- **తెలంగాణ అభివృద్ధి ఆగిపోతుంది**
- **ఆర్‌ఆర్ ట్యాక్స్ పేరిట వసూళ్లు**
- **'అసెంబ్లీ ఎన్నికల' హామీలు ఏమయ్యాయి?**
- **రుణమాఫీ చేశారా, మహిళలకు రూ.2500 ఇచ్చారా?**
- **వరంగల్ జనభేరి సభలో ప్రధాని మోదీ**

వరంగల్, మే 8 (నమస్తే తెలంగాణ) : అవినీతి కాంగ్రెస్ నైజం అని, అధికారంలో ఉన్నప్పుడు దేశంలో జరిగిన వేల కోట్ల కుంభకోణాలు బయటకు వచ్చిన విషయం ప్రజలకు తెలుసని, ఇప్పుడు ఆ పార్టీ మళ్లీ వస్తే సమస్యలు వస్తాయని, తెలంగాణ అభివృద్ధి ఆగిపోతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, రైతు రుణమాఫీ, మహిళలకు రూ.2500 వచ్చాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి ఏ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆ రాష్ట్రాలు వాటికి ఏటీఎంలుగా మారిపోతున్నాయని, ఇప్పటికే తెలంగాణలో డబుల్ ఆర్ ట్యాక్స్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ప్రజలను దోచుకొంటున్నదని ఆరోపించారు. ఆర్‌ఆర్ అంటే ఒక ఆర్ రాహుల్‌గాంధీ, రెండో ఆర్ రేవంత్‌రెడ్డి అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ర్టాన్ని లూటీ చేసిన సొమ్ములో కొంత భాగం ఢిల్లీలోని కాంగ్రెస్ నేతలకు, మరికొంత భాగం హైదరాబాద్ కాంగ్రెస్ నేతలకు వెళ్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వరంగల్‌లోని తిమ్మాపూర్-లక్ష్మీపురం వద్ద బీజేపీ జనభేరి సభకు ఆయన హాజరై ప్రసంగించారు.

**మైక్రోస్కోప్‌లో చూసినా కనిపించదు**

ఇప్పటికే మూడో దశ పోలింగ్ పూర్తయిన రాష్ర్టాల్లో ఎన్డీఏ విజయపథంలో దూసుకెళ్తున్నదని, ప్రస్తుతం ఆ రాష్ర్టాల్లో కాంగ్రెస్ గెలిచే సీట్లు భూతద్దంతో వెతికినా కనిపించే పరిస్థితి లేదని మోదీ అన్నారు. ఇక నాలుగో దశ పోలింగ్ జరిగిన తర్వాత కాంగ్రెస్ పార్టీ గెలిచే స్థానాలు వెతకడానికి భూతద్దం కాదు మైక్రోస్కోప్ కావాల్సి ఉంటుందని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ గెలిస్తే ఏడాదికో పార్టీ నుంచి ప్రధాని అవుతారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను అబద్ధాలకోరు పార్టీగా అభివర్ణించిన మోదీ.. కాంగ్రెస్ అగ్రనేత పుట్టినరోజు రైతుల రుణమాఫీ అని ఇప్పుడు మళ్లీ ఆగస్టు 15 అంటూ దేవుళ్లపై ఒట్టేస్తున్నారని అది అయ్యే పనేనా అని దుయ్యబట్టారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తే అమరుల కుటుంబాలకు పెన్షన్, 200 గజాల స్థలం ఇస్తామని చెప్పి ఏదీ చేయలేదని నెలనెలా మహిళలకు రూ.2500, ఇందిరమ్మ ఇండ్లు రాలేదని మోదీ విమర్శించారు. సనాతన ధర్మాన్ని తిట్టే కాంగ్రెస్ నేతలు ఇప్పుడు కొత్తగా దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వస్తే తెలంగాణ అభివృద్ధి ఆగిపోతుందని, కేంద్ర ప్రభుత్వం ఇక్కడ అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ములుగులో సమ్మక్క-సారలమ్మ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని, వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్‌దీ అదే పరిస్థితి అని మోదీ మండిపడ్డారు. రైతులు, యువతకు బీజేపీ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఇచ్చిన హామీని అమలు చేస్తామని ప్రధాని చెప్పారు. 40 ఏండ్ల క్రితం బీజేపీ దేశంలో గెలిచిన రెండు సీట్లలో హనుమకొండ ఒకటని ఆయన గుర్తుచేశారు. గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థులు అరూరి రమేశ్, అజ్మీరా సీతారాంనాయక్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, బీజేపీ నేతలు ఎం ధర్మారావు, గంట రవికుమార్, రావు పద్మారెడ్డి, కొండేటి శ్రీధర్ పాల్గొన్నారు.



ప్రధాని సభలో కాషాయ జెండాతో చిన్నారి



కాశీబుగ్గ : కార్నర్ మీటింగ్‌కు భారీగా తరలివచ్చిన ప్రజలు

# పేదింటి బిడ్డ సుధీర్‌ను గెలిపించాలి

- **పదవులు అనుభవించి మోసం చేసిన వారిని తరిమికొట్టాలి**
- **కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి : ఎమ్మెల్సీ పోచంపల్లి**
- **సీకేఎం కాలేజీ, కాశీబుగ్గలో బీఆర్‌ఎస్ కార్నర్ మీటింగ్**

పోచమ్మమైదాన్/కాశీబుగ్గ, మే 8: వరంగల్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన పేదింటి బిడ్డ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి కోరారు. బుధవారం రాత్రి వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కాలేజీ వద్ద, కాశీబుగ్గ జంక్షన్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలంటే కారు గుర్తుకు ఓటు వేసి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కావ్య తండ్రి ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, డిప్యూటీ సీఎం పదవులు అనుభవించారని గుర్తుచేశారు. నేడు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్న కడియంకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. అలాగే, అరూరి రమేశ్ పదేళ్లు బీఆర్‌ఎస్ తరపున ఎమ్మెల్యేగా ఉండి, ఇప్పుడు స్వార్థంతో బీజేపీలో చేరి మోసం చేశారని విమర్శించారు. ఎంపీగా సుధీర్‌కుమార్ గెలిచిన తర్వాత కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై పోరాటం చేసి, ప్రజలకు పథకాలు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటిందని, కల్యాణ లక్ష్మి, తులం బంగారం, మహిళలకు రూ. 2,500 ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇకనైనా ప్రజలు ఆలోచించి, బీఆర్‌ఎస్ అభ్యర్థికి పట్టం కట్టాలని కోరారు. సమావేశంలో అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్, నాయకులు ఎండీ మసూద్, మావురపు విజయభాస్కర్‌రెడ్డి, అచ్చ విద్యాసాగర్, కంచర్ల శివకుమార్, బయ్యాస్వామి, డాక్టర్ హరి రమాదేవి, తుమిక రమేశ్‌బాబు, మసూద్, కేతిరి రాజశేఖర్, ఎండీ ఇక్బాల్, చిమ్మని సంతోష్, క్యాతం రంజిత్, సిలువేరు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

# వరంగల్ అభివృద్ధి పట్టని మోదీ, రేవంత్

- **ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధిచెప్పాలి**
- **అబద్ధాల పునాదులపై కాంగ్రెస్**
- **తెలంగాణలో పర్యటించే హక్కు మోదీకి లేదు**
- **శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్**

హనుమకొండ, మే 8: ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో తమ ప్రసంగాల్లో వరంగల్ అభివృద్ధిపై మాట్లాడకపోవడం విచారకరమని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, నన్నపునేని నరేందర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భద్రకాళి, రామప్ప ఆలయ అభివృద్ధి, నగర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై కాకుండా ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి పూర్వ సమస్యల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మత రాజకీయాలు చేస్తుంటే, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరిత, అమలు కాని హామీలతో మరోసారి మోసం చేయాలని చూస్తోందన్నారు. మోదీ తన ప్రసంగంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ గురించి ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. ఇటీవల గిరిజన యూనివర్సిటీని నామమాత్రంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయిలో ప్రారంభించ లేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై తల్లిని చంపి బిడ్డను వేరుచేశారన్న ప్రధాని మోదీకి రాష్ట్రంలో పర్యటించే హక్కులేదన్నారు. రాహుల్‌గాంధీ ఇటీవల మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2500 ఖాతాలో జమ అవుతున్నాయనడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులపై బతుకుతోందని దుయ్యబట్టారు. ఐదు నెలలుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రావడంలేదని, విదేశీ విద్య నిధులు విడుదల కావడంలేదని, కల్యాణలక్ష్మి వంటి పథకాలకు నిధులు ఇవ్వడం లేదన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. వరంగల్ ప్రజలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్‌గౌడ్, కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, మైనారిటీ నాయకుడు నయీముద్దీన్ పాల్గొన్నారు.



హనుమకొండ బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న బండా ప్రకాశ్, చిత్రంలో వినయ్‌భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, నరేందర్, అభ్యర్థి సుధీర్‌కుమార్

## ఉద్యమకారులకు, ద్రోహులకు పోటీ

*– ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి*

ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ వంటి ద్రోహులు, మోసకారులకు ఓటుతో దెబ్బకొట్టాలి. బీఆర్‌ఎస్ పార్టీ అరూరి రమేశ్‌ను బీజేపీలోకి పంపి లోపాయికారి ఒప్పందం చేసుకుందన్న సీఎం రేవంత్‌రెడ్డి.. కడియం శ్రీహరిని కూడా కాంగ్రెస్‌లోకి మేమే పంపించామని చెప్పాలి. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఇలా మాట్లాడొద్దు. భద్రకాళి ఆలయ అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.30కోట్ల నిధులను క్యాన్సల్ చేసింది మీరు కదా? భద్రకాళి ఆలయానికి, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయానికి బీజేపీ ఒక్క రూపాయి ఇవ్వలేదు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికలు తెలంగాణ ఉద్యమకారులకు, ద్రోహులకు జరుగుతున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ మోసపూరిత రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు.

## నా గెలుపు ఖాయం

*– బీఆర్‌ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్*

నా గెలుపు ఖాయమైంది. ఇప్పటికే బీఆర్‌ఎస్ ప్రభంజనాన్ని చూసి భయంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడుసార్లు, ప్రధాని మోదీ ఒకసారి వరంగల్‌కు వచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నన్ను దిష్టిబొమ్మ అన్నారు. అవును నేను దుష్టశక్తులైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను అడ్డుకొనే దిష్టిబొమ్మనే. వెకిలి మాటలు, చేష్టలు చేస్తున్న సీఎంను ప్రజలు మూడు నెలల్లోనే తిరస్కరించారు. ఒక డమ్మీ ముఖ్యమంత్రివి నువ్వు.. ఒక ఉద్యమకారుడిని నేను. మంగళవారం చోటాభాయ్ వస్తే.. బుధవారం బడే భాయ్ వచ్చారు. కడియం కావ్యకు అసలు సభ్యత్వం లేదు. మోసపూరిత వ్యక్తులు కడియం శ్రీహరి. అరూరి గురించి ఎవరిని అడిగినా చెబుతారు. వరంగల్ అభివృద్ధి బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యం. ఓరుగల్లు ప్రజలు చరిత్రాత్మకమైన తీర్పు ఇస్తారు.

## నకిలీ దళితుడు కడియం

*– మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య*

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నకిలీ దళితుడు.. కడియం కావ్య నకిలీ మతస్తురాలు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడు. 30ఏళ్ల దండోరా ఉద్యమంలో కడియం కావ్య పాత్రలేదు. కుటుంబ పాలనకు వ్యతిరేకమన్న కాంగ్రెస్ పార్టీ కుటుంబ పాలనే ప్రోత్సహిస్తోంది. కడియం శ్రీహరి, కావ్యకు బుద్ధి చెప్పేందుకు ఆ పార్టీ నాయకులే కంకణబద్ధులవుతున్నారు. కడియంపై తిరగబడేందుకు మంత్రి కొండా సురేఖ, ఇందిర సిద్ధమవుతున్నారు. డబ్బుతో గెలుస్తామనుకుంటున్నారు. కడియం కావ్యను ఓడించడమే కాకుండా ఈ ఎన్నికలతో కడియం శ్రీహరి రాజకీయ జీవితం సమాధి కావడం ఖాయం.



చినమడూరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, చిత్రంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ

# తెలంగాణకు బీఆర్‌ఎస్సే శ్రీరామరక్ష

- **కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి**
- **అబద్ధాలతో మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి**
- **మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

దేవరుప్పుల, మే 8: తెలంగాణలోని వనరులు దోపిడీకి గురికాకుండా ఉండాలంటే పెద్దదిక్కు బీఆర్‌ఎస్ అని ప్రజలు ఇప్పటికే గ్రహించారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలయ్యాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాల పరిధిలో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారితో కలిసి విస్తృత సమావేశాలు నిర్వహించారు. ఎర్రబెల్లి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష మేరకు ఉద్యమనేత కేసీఆర్ పోరాటంతో స్వరాష్ట్రం సాధించుకున్నామన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఐదు నెలల పాలనలో హామీలను నెరవేర్చలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరోసారి మోసగించేందుకు అబద్ధాలు ప్రచారం చేస్తూ, కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే మనకు కేసీఆరే శ్రీరామరక్ష అన్నారు. కాంగ్రెస్ పాలనలో సాగు, తాగునీటి సమస్యలతోపాటు కరెంట్ కోతలు నెలకొని ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఎర్రబెల్లి తెలిపారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి నిజస్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారని .. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.

**దేవరుప్పుల నుంచి భారీ మెజార్టీ ఖాయం**

ఒకప్పుడు ఎడారిని తలపించిన దేవరుప్పుల మండలంలో వాగులపై చెక్‌డ్యాములు నిర్మించడంతో పాటు దేవాదుల కాల్వ ద్వారా సాగునీరందించడం వల్ల సస్యశ్యామలమైందని ఎర్రబెల్లి తెలిపారు. 15 ఏళ్లలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిన ఫలితంగా ప్రజలంతా తన వెంట ఉన్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలోనే భారీ మెజార్టీ ఇక్కడి నుంచి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ బస్వ సావిత్రి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, ప్రధాన కార్యదర్శి చింత రవి, నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, బస్వ మల్లేశ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





మంత్రి తుమ్మల ప్రసంగిస్తున్న సమయంలో జనంలేక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

# ఖాళీ కుర్చీలతో కాంగ్రెస్ సభ

- **మంత్రి తుమ్మల మాట్లాడకముందే వెళ్లిపోయిన ప్రజలు**
- **మంత్రి, ఎంపీ, అభ్యర్థి బలరాం నాయక్‌కు చేదు అనుభవం**
- **జనం లేక బయ్యారం శంఖారావ సభ వెలవెల**

బయ్యారం, మే 8 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బయ్యారం శివారులో బుధవారం సాయంత్రం నిర్వహించిన కాంగ్రెస్ శంఖారావ సభ జనం లేక ఖాళీ కుర్చీలతో వెలవెలబోయింది. ఈ సభకు రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ హాజరుకావాల్సి ఉంది. మంత్రి రాక ఆలస్యమవుతుండడంతో ముందుగా వామపక్ష నాయకులు, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి సభను ప్రారంభించారు. కొద్దిసేపటికే జనం ఒక్కొక్కరుగా బయటికి వెళ్లిపోవడం కనిపించింది. దీంతో కాంగ్రెస్ నాయకులు వారిని అడ్డగించి మరీ సభా ప్రాంగణానికి రావాలని ప్రాధేయపడినప్పటికీ వారు వెళ్లిపోయారు. దీంతో మైదానంలో అన్నీ ఖాళీ కుర్చీలే కనిపించాయి. అనంతరం అక్కడకు చేరుకున్న మంత్రి తుమ్మల సైతం అరకొర జనం, ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండగానే ప్రసంగించారు. సభ పూర్తి కాకుండానే జనం వెనుదిరిగిపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు నిరుత్సాహానికి గురయ్యారు.

# నమ్మకద్రోహానికి మారుపేరు కడియం

- **అధికారదాహంతోనే కాంగ్రెస్‌లోకి..**
- **దమ్ముంటే రాజీనామా చేయాలి**
- **జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సవాల్**



లింగాలఘనపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

లింగాలఘనపురం, మే 8 : మోసాలకు, నయవంచనకు మారుపేరైన కడియం శ్రీహరి అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కారు గుర్తుపై గెలిచిన శ్రీహరికి దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని సవాల్ విసిరారు. బుధవారం లింగాలఘనపురం మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కడియం శ్రీహరికి బీఆర్‌ఎస్‌లో కేసీఆర్ ఎన్నో పదవులను ఇచ్చారని కానీ ఆయన అవన్నీ మరిచి కూతురిని ఎంపీగా చేసుకునేందుకు అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరారని, దీనిని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రపంచంలో కడియం శ్రీహరి అంత నీచుడు, నమ్మద్రోహి మరొకరు లేరని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు డిపాజిట్ దక్కకుండా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్, నాయకులు దుంబాల భాస్కర్‌రెడ్డి, రాపోలు శ్రీనివాస్, ఏదునూరి వీరన్న, మబ్బు కరుణాకర్, ఉడుగుల భాగ్యలక్ష్మి, గట్టగల శ్రీహరి పాల్గొన్నారు.